క్లుప్తంగా

కుందూనదికి నీటి విడుదల



కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని కుందూనదికి అధికారులు నీటిని విడుదల చేశారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, రైతులకు తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేశారు. మార్చి నెలలో సైతం నదిలో నీరు పుష్కలంగా చేరడంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

12న వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవం

బనగానపల్లె: పట్టణంలో రూ.22 కోట్లతో నిర్మించిన వంద పడకల ప్రభుత్వ ఏరియా వైద్యశాలను ఈ నెల 12న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

డోన్ రూరల్ : చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన సంజీవరెడ్డి(51) డోన్ భారత్ గ్యాస్ ఎదురుగా ఉన్న మహి గ్రానైట్స్ వద్ద శుక్రవారం అనుమానాస్పదంగా మృతి చెందాడని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించారు. విచారించగా మృతుడు గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వహించేవాడని తేలిది. కర్నూలుకు వెళ్లి డబ్బులు తీసుకొస్తానని భార్య లక్ష్మీదేవికి చెప్పి గురువారం వెళ్లాడు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించామని, భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

డోన్ టౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఈ నెల 10వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్తేర్ గీత తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి పరీక్ష ఉంటుందని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు అభ్యర్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ

డోన్: పట్టణంలోని 29వ వార్డుకు చెందిన వడ్డె నాగన్న అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అతని కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.15లక్షలు మంజూరైంది. ఈ చెక్కును మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్ బాధిత కుటుంబానికి అందజేశారు.

➡ మున్సిపల్ కౌన్సిలర్ దినేష్‌గౌడ్ తన స్వగృహంలో వార్డుకు చెందిన మహేష్‌కు రూ.18వేలు, షేక్ సోనియా రూ.24 వేలు, తెలుగు వెంకటేశ్వర్లు రూ.14వేలు, వడ్డె మద్దమ్మకు రూ.75వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.

బండలాగుడు పోటీలు

డోన్ రూరల్: మండలంలోని దేవరబండ గ్రామంలో శుక్రవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం16 జతల ఎద్దులు పాల్గొన్నాయి. వైఎస్సార్ కడప జిల్లా దాసరిపల్లి గ్రామానికి చెందిన చిన్నవీరన్నయాదవ్‌కు చెందిన ఎద్దులు మొదటి స్థానం(రూ.40 వేలు)లో నిలిచాయి. తరువాత స్థానాల్లో గుంటూరు జిల్లాకు చెందిన రమేష్‌నాయుడు (రూ.30వేలు), నంద్యాల జిల్లా మల్యాల గ్రామానికి చెందిన షేక్ మహిమున్నా (రూ.20వేలు), కర్నూలు జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన గోపాల్ గౌడ్ (రూ. 10 వేలు), నేమ్‌కల్లు గ్రామానికి చెందిన జానకి రాముడు, కొత్తబురుజు గ్రామానికి చెందిన చంద్రమ్మ ఎద్లు నిలిచాయి.

నేడు డోన్‌లో మంత్రి పర్యటన

డోన్: ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం డోన్ మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రాజ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ధర్మవరం గ్రామంలో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారన్నారు. ఉదయం 11 గంటలకు డోన్‌లో రూ.కోటితో నిర్మించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఎద్దుపెంట గ్రామంలో కేడీసీసీ బ్యాంకు శాఖ, అనంతరం ఎద్దుపెంట నుంచి అనుంపల్లె వరకు నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తారని వెల్లడించారు. సాయంత్రం 5.30 గంటలకు కొత్తకోట గ్రామం వద్ద రూ.3 కోట్లతో నిర్మిస్తున్న ఐటీబీఆర్ డ్రైవింగ్ స్కూల్‌ను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

హరహర శంభో



బేతంచెర్ల ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో..



ప్యాపిలి: కలశాలతో శివాలయానికి వెళ్తున్న భక్తులు



కొలిమిగుండ్ల: నేలబెలుంలో పూజలు చేస్తున్న భక్తులు



కొలిమిగుండ్ల: పెట్నికోటలో అన్నదానం చేస్తున్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి



కోవెలకుంట్ల: పంచముఖి సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు
- శివన్నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ఘనంగా శివరాత్రి వేడుకలు

కోవెలకుంట్ల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఓం నమః శివాయ.. హరహర మహాదేవ శంభో శంకరా నామస్మరణతో మార్మోగాయి. ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోవెలకుంట్ల గాంధీసెంటర్‌లోని పంచముఖ సిద్ధేశ్వరస్వామి, కాశీవిశ్వనాథుని ఆలయం, ఏడుకొప్పెర్ల బావి సమీపంలోని అగస్తీశ్వరస్వామి దేవాలయం, గాంధీనగర్‌లోని శివాలయం, బనగానపల్లె చౌరస్తాలోని నాగలింగేశ్వరస్వామి, జుర్రేరు ఒడ్డున ఉన్న శివాలయంతో పాటు వెలగటూరు, బిజనవేముల, భీమునిపాడు, గుళ్లదూర్తి గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో శివరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో అభిషేకాలు, బిల్వార్చన, కలశస్థాపన, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ జపాలు తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివార్ల గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉమామహేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే మత సామరస్యానికి ప్రతీకగా కోవెలకుంట్ల శివారులోని జుర్రేరు ఒడ్డున ఉన్న అగస్తీశ్వర ఆలయంలో శుక్రవారం శివరాత్రి వేడుకలు, శనివారం నుంచి నూర్‌షావలి దర్గాలో గంధం, ఉరుసు వేడుకలు జరగనున్నాయి.

భక్తిశ్రద్ధలతో పూజలు

సంజామల: మండలంలోని శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. శ్రీశైలం, మహానంది, యాగంటి, ఓంకారం తదితర శైవ క్షేత్రాలకు మండలం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు.

శంభో శంకర

కొలిమిగుండ్ల: మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు, రామ్‌కో సిమెంట్ యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు, ప్రెసిడెంట్ రామరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగోద్భవ కాలాభిషేకం, ప్రసన్న పార్వతీ గుండుమల్లేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. జెడ్పీచైర్మన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. చింతామణి నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. నేలబెలుం మల్లేశ్వరస్వామి ఆలయం, బెలుం సిద్ధరామేశ్వరస్వామి, కొలిమిగుండ్ల లలితా సుందరేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు

యాగంటిలో వేడుకగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

బనగానపల్లె రూరల్: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగంటిలోని ఉమామహేశ్వరస్వామికి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్ర నామావళి తదితర పూజలు చేశారు. స్వామివారికి తిరుమల తిరుపతి దేవస్థానం పంపిన పట్టువస్త్రాలను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతులు, నరసింహారెడ్డి ఆలయ అర్చకులకు అందజేశారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలతో సత్కరించారు. భక్తుల కోసం తాగునీరు, వైద్య శిబిరాలు, టాయిలెట్స్ తదితర సౌకర్యాలను కల్పించారు.



కోవెలకుంట్ల: ప్రత్యేక అలంకరణలో అగస్తీశ్వరుడు

కిక్కిరిసోయిన ఆలయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలోని ముచ్చట్ల భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామికి రుద్రాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. ఆర్‌ఎస్‌రంగాపురం గ్రామం నుంచి స్వామిఅమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలాయానికి తీసుకొచ్చారు. పూదోట మఠంలో అఖండశివపంచాక్షరీ నామజపం చేశారు. దుర్గాపేటలోని సిద్ధేశ్వరస్వామి ఆలయం, యంబాయి రామలింగేశ్వరస్వామి, సిమెంటునగర్ జీవబుగ్గలింగేశ్వరస్వామి, ముద్దవరం గురుకుంట మల్లయ్య స్వామి, బైనపల్లె, ముసలాయిచెర్వు, రహిమానుపురం గ్రామంలో కాశీవిశాలాక్షి, విశ్వేరస్వామికి అభిషేక పూజలు చేశారు.



యాగంటిలో స్వామివారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

శివోహం

ప్యాపిలి: పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి దేవాలయం, పెద్దపొదిళ్లలోని రామలింగేశ్వరస్వామి, మెట్టుపల్లి సమీపంలోని కాకనవరం రామలింగేశ్వర స్వామి, పీఆర్ పల్లి పంచలింగాల స్వామి దేవాలయాల్లో శుక్రవారం ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. నీలకంఠేశ్వర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో పట్టణంలో కలశాల ఊరేగింపు జరిగింది.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

అవుకు: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి పల్లెలో ప్రభుత్వ కార్యాలయాలు నెలకొల్పారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్రవారం అవుకు మండల పరిధిలోని శింగనపల్లె ఓబుళాపురం, చనుగొండ్ల, సుంకేసుల గ్రామాల్లో రూ.2.01 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. శింగనపల్లెలో రూ.23.94 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.43.6 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.20 లక్షల గడపగడప నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, ఓబుళాపురం గ్రామంలో రూ.35 లక్షలతో 40వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంక్, రూ.5లక్షలతో నిర్మించిన శుద్ధ జలకేంద్రం, సుంకేసులలో రూ.20.8 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, చనుగొండ్లలో రూ.43.6 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. అదేవిధంగా శింగనపల్లెలో 65 మందికి భూ పంపిణీ, 18 మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వైఎస్ జగన్ సీఎం అయ్యాక ప్రతి గ్రామంలో సచివాలయాన్ని నిర్మించి ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేశారని తెలిపారు. ఎన్నికల తరువాత అవసరమైన వారికి ఈ భూముల్లో జలకళ ద్వారా బోర్లు వేయిస్తామని, శివవరం రస్తాకు బీటీ రోడ్డు వేయిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ఓబుల్‌రెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డి, సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కళ్లకు పొరలు వచ్చినట్టున్నాయి

సుంకేసుల గ్రామానికి తాను ఏం చేయలేదని అంటున్న బీసీ జనార్దన్‌రెడ్డి కళ్లకు ఏమైనా పొరలు వచ్చాయా లేదా కళ్లకు గంతలు కట్టుకుని ఉన్నారా అంటూ ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. ఆకుమళ్ల నుంచి చనుగొండ్ల మీదుగా సుంకేసులకు 7.2 కి.మీ బీటీ రోడ్డు, గ్రామంలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్, గ్రామ సచివాలయం నిర్మాణం ఇవన్నీ అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. ఒకవేళ కళ్లకు పొరలు వచ్చి ఉంటే కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామన్నారు. అనంతరం గ్రామానికి చెందిన కొందరు నాయకులు ఎమ్మెల్యే రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

కొలిమిగుండ్ల: బనగానపల్లె నియోజకవర్గం ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమా అంటూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాజీ ఎమెల్యే బీసీ జనార్దనరెడ్డికి సవాల్ విసిరారు. శుక్రవారం కమ్మవారిపల్లె, కల్వటాల, కొలిమిగుండ్ల గ్రామాల్లో రూ.3.75 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంక్, సీసీ రోడ్లు, బ్రిడ్జి ,గ్రావెల్ రోడ్లతో పాటు రామ్‌కో సహకారంతో కొలిమిగుండ్లలో సెంట్రల్ లైటింగ్, ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీరోడ్డు తదితర అభివృద్ధి పనులను జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కొలిమిగుండ్లలో ఆయన మాట్లాడుతూ.. రామ్‌కో సహకారంతో రూ.10 కోట్లతో కొలిమిగుండ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులు, పంక్షన్ హాల్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. టీడీపీ నాయకులు అభివృద్ధి జరగలేదని విష ప్రచారం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో సంక్షేమ పథకాల రూపంలో రూ.1645 కోట్లు ప్రజల అకౌంట్లలో జమ అయ్యాయని తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్‌క్లీనిక్, పాఠశాలలు, సీసీ రోడ్లు కనిపించడం లేదా అన్ని ప్రశ్నించారు. రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, రామరాజు, సర్పంచ్‌లు కొండయ్య, శివరాముడు, ఎంపీటీసీ సభ్యుడు వెంకట రమణ, పార్టీ మండల అధ్యక్షుడు గుర్విరెడ్డి, సత్యనారాయణరెడ్డి, లాయర్ మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



కమ్మవారిపల్లెలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి



శింగనపల్లెలో భూపట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి



సుంకేసులలో హెల్త్ క్లీనిక్ ప్రారంభం



బేతంచెర్ల: గోరుమానుకొండలో నిర్మించనున్న పాలిటెక్నిక్ కళాశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు

- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- గోరుమానుకొండలో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన

బేతంచెర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విద్యాభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపంలో రూ.26 కోట్లతో నిర్మించనున్న పాలిటెక్నిక్ కళాశాల భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో మంత్రి ముచ్చటించారు. వెనుకబడిన ప్రాంతంలో సకల సదుపాయాలు, అత్యాధునిక వసతులతో విద్యాలయాలు నిర్మిస్తున్న మంత్రికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానానికి వెళ్లాలనే ఉద్దేశంతో ఐటీఐ, బీసీ రెసిడెన్సియల్ స్కూలు, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేశామని మంత్రి బుగ్గన తెలిపారు. అనంతరం బేతంచెర్లలో రూ.78 లక్షలతో ఆధునీకరించిన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించారు. అలాగే రైల్ రోడ్ రెసిడెన్సీ లాడ్జ్‌ను మంత్రి ప్రారంభించారు. డోన్ ఆర్డీఓ మహేశ్వర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ మునిస్వామి, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్లు ముర్తుజావలి, ఖాజా, గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబు రెడ్డి, ఆర్‌జేడీ నిర్మల కుమార్ ప్రియ, ప్రిన్సిపల్ రాజేష్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు సబ్‌రిజిస్ట్రార్ నూతన కార్యాలయం ప్రారంభం

డోన్: స్థానిక రెవెన్యూ క్వార్టర్స్ ఆవరణలో రూ.కోటితో నిర్మించిన నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాన్ని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ప్రారంభించనున్నారని మున్సిపల్ చైర్మన్ రాజేష్, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ సీమ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



మంత్రి బుగ్గన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కొలుములపల్లెకు చెందిన టీడీపీ నేతలు

బేతంచెర్ల: మండలంలోని కొలుములపల్లెకు చెందిన 100 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పార్టీ కుండువాలు కప్పి ఆహ్వానించారు. వీరిలో నిజంగారి బిశ్వేశ్వరయ్య, చత్రగున్నడు, డిష్ ప్రసాద్, చంద్ర, దూదేకుల మణి బాషా, గుర్రం బాషా, కుల్లాయి స్వామి, మమ్మద్ బాషా, గోపాల్, సంజీవ, అల్లా స్వామి తదితరు ఉన్నారు. బేతంచెర్ల పార్టీ కార్యాలయంలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసి చూపించారని తెలిపారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే తమను మరోసాని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, బొల్లవరం సునీల్ కుమార్‌రెడ్డి, గూని నాగరాజు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి సందర్భంగా పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి చేతల మీదుగా శుక్రవారం బహుమతులను అందజేశారు. కొలిమిగుండ్ల జట్టు మొదటి స్థానంలో నిలిచింది. పెట్నికోట, కొలిమిగుండ్ల మోడల్‌స్కూల్, ఓంకారం జట్లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. అలాగే బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బనగానపల్లె, తాడిపత్రి, అనంతపురం, రాజుపాలెం జట్లు విజయం సాధించాయి. దాతల సహకారంతో కబడ్డీ విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు అందజేశారు. బాల్ బ్యాడ్మింటన్ విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు,రూ.6వేల నగదు అందజేశారు.

జూదరుల అరెస్ట్

అవుకు: సంగపట్నం గ్రామ సమీపంలోని ఎస్సార్బీసీ కాలువ వద్ద శుక్రవారం జూదం ఆడుతున్న నాగభూషణం, గురు ప్రసాద్, శివశంకర్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్ బాబు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.62,570 నగదు, 11 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

- సబ్ కోర్టు సివిల్ జడ్జి తంగమణి

డోన్ రూరల్: మహిళలు తమకు జరిగే అన్యాయాన్ని ధైర్యంగా ఎదుర్కొవాలని, తమ రక్షణ కోసం న్యాయస్థానాలను ఆశ్రయించాలని తెలిపారు. పట్టణంలోని రాజా కాంప్లెక్స్ హాల్‌లో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్జి తంగమణి, డోన్ ప్రభుత్వాస్పత్రి డాక్టర్ రమ్యశిల్ప హాజరయ్యారు. జడ్జి మాట్లాడుతూ.. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళల రక్షణ కోసం 498 ఏ గృహహింస నిరోధక చట్టం ఉందని తెలిపారు. ధైర్యంగా ముందుకు వస్తే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా సమైఖ్య జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ షమీం , హసీనా, డాక్టర్ దీపిక, ప్రమీల, కౌన్సిలర్ పి.సుంకయ్య పాల్గొన్నారు.

➡ **కొలిమిగుండ్ల:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని లేబర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ బషీర్ ఉన్నీష అన్నారు. రామ్‌కో సిమెంట్ కంపెనీలోని లేడీస్ క్లబ్‌లో ఆమె మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని చెప్పారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు.

➡ **బనగానపల్లె రూరల్:** ప్రతి కుటుంబంలో మహిళల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, కోడలు కాటసాని మేధాశ్రీరెడ్డి అన్నారు. బనగానపల్లె పొదుపు భవనంలో వారు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా ఉంటూ వారి ఆర్థికాభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

➡ **డోన్ టౌన్/డోన్ రూరల్:** స్థానిక పాతపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, గోపాల్, పాఠశాల హెచ్ఎం పద్మావతమ్మ, యూటీఎఫ్ మహిళా కార్యదర్శి లీలావతమ్మ పాల్గొన్నారు.



డోన్‌లో మాట్లాడుతున్న సివిల్ జడ్జి తంగమణి

➡ **కోవెలకుంట్ల:** స్థానిక గాంధీనగర్‌లో ప్రతిభాటైలరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా టైలర్ల సంఘం అధ్యక్షురాలు జులేఖాబి, లక్ష్మీదేవి, అపర్ణ, తదితరులు కేక్‌కట్ చేశారు.